క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలోని భూలోకమాంబ గుడి వద్ద ఆదివారం సింహగిరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు సేవలదింస్తారని చెప్పారు. సింహపురి కాలనీ, అప్పన్నపాలెం, వాంబే కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నేడు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీ ఆర్చ్ వద్ద ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా అందిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి తెలిపారు. భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా అమావాస్య తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చక బృందం

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం విశేషంగా తిరువీధి జరిగింది. ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి పల్లకీలో వేంజేపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో సాయంత్రం తిరువీధి నిర్వహించి, హారతి సమర్పించారు. భక్తులు అప్పన్నను దర్శించుకుని తరించారు.

తాగునీటి సదుపాయం కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: జీవీఎంసీ 94వ వార్డు చైతన్య కాలనీకి మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జోన్-8 కార్యాలయ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ 2007లో ఇక్కడ కాలనీ ఏర్పడిందన్నారు. దాదాపు 50 కుటుంబాలు కాలనీలో నివసిస్తున్నాయని, వారికి ఇప్పటివరకు తాగునీటి సదుపాయం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాలనీకి మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు వెంకటలక్ష్మి, బి.వెంకటరావు, అప్పలనాయుడు, సూరమ్మ, ప్రసాద్, లక్ష్మి, ప్రభుదేవా, రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలు అందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

పెందుర్తి : పురుషోత్తపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణపతి మట్టి విగ్రహాలను శనివారం పంపిణీ చేశారు. హెచ్ఎం చిరికి శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏయూ మాజీ వీసీ ఆచార్య నాగేశ్వరరావు

విశాఖ సిటీ : అపోహలు వీడి అవకాశమున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు సూచించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మహారాణిపేట శాఖ నిర్వాహకురాలు శివలీల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ దేశంలో రోజూ వేలాది ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే నిమిషానికి 232 మంది క్యాన్సర్‌తో మృత్యువాత పడుతున్నారని, వీరందరికీ రక్తం ఎంతో అవసరమన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నిరంతరం సమాజం కోసం పాటుపడే బ్రహ్మకుమారీస్ రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ వైద్యురాలు దేదీప్య, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



కలపాక రహదారిలో ప్రమాదకర మలుపు



జాజులవానిపాలెం - పి.బోనంగి రహదారిలో మలుపు



వెంకటాపతిపాలెం వద్ద అత్యంత ప్రమాదకర మలుపు

మృత్యు మలుపులు

- ప్రమాదకరంగా గ్రామీణ రోడ్లపై ప్రయాణం
- మలుపుల వద్ద కనిపించని వాహనాలు
- ఇప్పటికే ప్రమాదాల్లో పలువురి దుర్మరణం
- హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయని అధికారులు



వాడచీపురుపల్లి - పరవాడ రహదారిలో గొల్లపేట వద్ద ప్రమాదకర మలుపు

పరవాడ : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల మలుపులు ప్రయాణికుల పాలిట మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. ప్రమాదకరమైన మలుపుల వద్ద కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం లేదు. పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందిన పరవాడలో ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా, ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతాల్లో అనేక పరిశ్రమలున్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పరిశ్రమల్లో విధులకు వెళ్లడానికి వారు ద్విచక్ర వాహనాలు, కార్లు వంటి ఉపయోగిస్తున్నారు. విధులకు వెళ్లే క్రమంలో గ్రామీణ రహదారులపై పొంచి ఉన్న మలుపులు ఉద్యోగులు, కార్మికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. మలుపులను గుర్తించకుండా వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. యువకులు, కొంత మంది ఉద్యోగులు వేగంగా వస్తూ వాహనాలను అదుపు చేయలేక మలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. అతిగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కూడా కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రాణాలు హరించేస్తున్న రహదారులు

➡ యలమంచిలి - గాజువాక రహదారిలో పరవాడ పోలీస్ స్టేషన్ వద్ద గల మలుపు చాలా ప్రమాదకరంగా మారింది. ఇక్కడి స్టేషన్‌లో ఏపుగా పెరిగిన చెట్ల వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ గతంలో వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు.

➡ మండల కాంప్లెక్సు, సబ్‌స్టేషన్, ఎర్రకోనేరు సమీపంలోని మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎర్ర కోనేరు వద్ద గతంలో బస్సు ఢీకొన్న ప్రమాదంలో తానాం గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.

➡ వాడచీపురుపల్లి - ముత్యాలమ్మపాలెం రహదారిలో మొత్తం 12 మలుపులున్నాయి. వీటిలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ మలుపుల్లో ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, ఇళ్ల నిర్మాణాల వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం సాధ్యం కావడం లేదు. మలుపుల వద్ద ఇసుక మేటలు వేయడం వల్ల కూడా వాహనాలు జారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

➡ జాజులవానిపాలెం - పి.బొనంగి, వాడచీపురుపల్లి - తిక్కవానిపాలెం, వెన్నలపాలెం - కలపాక రహదారుల్లోని మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారులు నిత్యం ద్విచక్ర వాహనదారులతో రద్దీగా ఉంటాయి. మలుపుల వద్ద ఏపుగా పెరిగిన తుప్పలు, డొంకలు వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.

➡ లంకెలపాలెం - సబ్బవరం రహదారిలో పెదముషిడివాడ గ్రామంలో రెండు మలుపులు ప్రమాదకరంగా మారాయి. రహదారిలో నిత్యం బొగ్గు, బూడిద లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ఎత్తైన భవంతుల కారణంగా ఈ మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా రాత్రి వేళల్లో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బేకర్లు ఏర్పాటు చేయలేదు.

➡ వాడచీపురుపల్లి - పరవాడ రహదారిలో ఊటగెడ్డ కూడలి, గొల్లపేట వద్ద మలుపులు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. గతంలో గొల్లపేట మలుపులో కోళ్ల వ్యాను ఢీకొట్టడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

హెచ్చరిక బోర్డులతో ప్రయోజనం



పరవాడ పోలీస్ స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర ప్రమాదాలను నివారించవచ్చు. కొన్నిచోట్ల స్పీడ్ బ్రేకర్లున్నా యువకులు మాత్రం వాహనాల వేగాన్ని తగ్గించడం లేదు. యువకుల డ్రైవింగ్ చూసి రోడ్ల మీద రాకపోకలు సాగించాలంటే భయమేస్తోంది. రాత్రి సమయంలో రోడ్డు దాటడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం.

– దుంగల పైడినాయుడు, పరవాడ

లైట్లు ఏర్పాటు చేయాలి



వీధి దీపాలు లేక చీకట్లో మలుపులను గుర్తించడం సాధ్యం కాక ప్రమాదాల బారిన పడుతున్నాం. గొల్లపేట మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముత్యాలమ్మపాలెం రహదారిలో అనేక మలుపుల వద్ద వీధి దీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– కె.అప్పారావు, వాడచీపురుపల్లి

చెట్లు, తుప్పలు తొలగించాలి



గ్రామీణ రహదారుల వెంబడి మలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తుప్పలు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నాం. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల మలుపుల వద్ద దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

– బి.రాము, స్వయంభూవరం

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సహస్రనామార్చన జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

విశేషంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



షాపుల యజమానులకు నోటీసులు అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి రమామణి

సబ్బవరం: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి సూచించారు. మండలంలోని బంగారమ్మపాలెంలో శనివారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ఉండేందుకు నీటిని వేడి చేసుకోని తాగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వేడి ఆహారం తీసుకోవడం, చేతులను శుభ్రపరుచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రజలు, గ్రామ సచివాలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలోని అన్ని గృహాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ప్రతి రోజు క్లాప్ మిత్రాలకు అందజేయాలని గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికను తొలగించి, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని షాపుల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ వినియోగించరాదని పలు షాపుల యజమానులకు ప్రత్యేక అధికారి నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, నారాయణరావు, సర్పంచ్ దాడి లావణ్య, డిప్యూటీ ఎంపీడీవో చైతన్య, పంచాయతీ కార్యదర్శి గుణలక్ష్మి, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత గ్రామాల అభివృద్ధికి చర్యలు

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామాల ప్రతినిధులతో ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సమావేశ అంశాలను తెలిపారు. దత్తత తీసుకున్న పినగాడి, గొరపల్లి, రాంపురం, కరకవానిపాలెం, కోటవానిపాలెం గ్రామాల ప్రతినిధులను సమైక్యపరచి ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ హెల్పింగ్ హ్యాండ్ వివరాలు తెలియజేశారు. పరస్పర సహకారం అందించుకుకి, అభివృద్ధి చేసే అంశాలపై చర్చించారు. గ్రామ పెద్దలు, నాయకులు ఇప్పటి వరకు అంబేడ్కర్ చైర్ చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్ కార్యాచరణలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. రాజ్‌కుమార్, ప్రవీణ్ సమన్వయంతో సమావేశం విజయవంతంగా నిర్వహించారు.



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

పరిశోధన పత్రాల సంకలనం ఆవిష్కరణ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రోల్ అండ్ రిలయన్స్ ఆఫ్ ది పేర్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు సంబంధించిన పరిశోధన పత్రాల సంకలనంగా తీర్చిదిద్దిన ప్రత్యేక సంచికను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి దోహదపడే అంశాలపై ఎంతో విలువైన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకొచ్చిన విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందంను అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న పరిపాలన వ్యవస్థలకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో పరిపాలనకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడం ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాధించవచ్చని చెప్పారు. విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ సోషల్ సైన్స్ రంగంలో పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలతో జరగాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వాలు ఈ దిశగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రేమానందం తదితరులు

పెందుర్తి పోలీసులకు రివార్డులు



సీపీ నుంచి రివార్డు అందుకుంటున్న సీఐ సతీష్‌కుమార్, ఏఎస్ఐ కాళీ ప్రసాద్

పెందుర్తి: పాత నేరస్తులను పట్టుకోవడం, గంజాయి కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్‌తోపాటు ఏఎస్ఐ కాళీప్రసాద్, పీసీలు వెంకటేశ్, కనకరాజులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సత్కరించి రివార్డులు అందజేశారు. నగరంలోని సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసి నేరాలను నియంత్రించాలని సూచించారు.

అటవీ సిబ్బందిపై దాడి దారుణం



కంబాలకొండలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అటవీ శాఖ సిబ్బంది

ఆరిలోవ: శ్రీశైలంలో అటవీ శాఖ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ విశాఖపట్నం డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడడం దారుణమని అసోసియేషన్ సభ్యులు మండిపడ్డారు. భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని ఖండించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజు, సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీలో పద్మకు 11వ ర్యాంకు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెంకు చెందిన లాలం పద్మ డీఎస్సీ–2025లో స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్) విభాగంలో జిల్లా స్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. మహిళా విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూనే, ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకుని ఈ విజయాన్ని అందుకున్నారు.



లాలం పద్మ

నూతన విద్యావిధానంతో ఆవిష్కరణలు సాధ్యం

ఎంవీపీ కాలనీ : నూతన విద్యావిధానంతో విద్యార్థుల్లో నైపుణ్యం, ఆవిష్కరణలు సాధ్యమవుతాయని ఏబీఆర్ఎస్ఎమ్ కార్యదర్శి జి.లక్ష్మణ్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎంలో ఎన్ఈపీ – 2020పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ – 2020 ద్వారా దేశవ్యాప్తంగా విద్యావిధానంలో సంపూర్ణ మార్పులు రానున్నట్లు తెలిపారు. జాతీయ విద్యావిధానాన్ని అన్ని రాష్ట్రాలు అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానంపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిభకు డిగ్రీలు ఒక్కటే కొలమానం అనే భావన విడనాడాలని సూచించారు. చదువుతోపాటు నైపుణ్యం, ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఆచార్య అవధాని, ఆచార్య పల్లవి మాట్లాడుతూ ఆవిష్కరణలు, సృజనాత్మకతతో విద్యార్థులు ముందడుగు వేస్తున్నారన్నారు. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎంవీఆర్ రాజు, ఆచార్య పల్లవి అతిథులను సత్కరించారు.

సింహగిరిపై 'స్వచ్ఛ ఆంధ్ర'

సింహాచలం : సింహగిరిపై శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణం, నక్షత్రవనం, ఆలయ పరిసరాలను దేవస్థానం సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. రోజూ పరిశుభ్రతకు కొంత సమయం కేటాయిస్తామని, స్వచ్ఛత కోసం శ్రమదానం చేస్తామని, తడి – పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తామని, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, పంతం శ్రీనివాస్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు, సత్యవాణి, కంచి మూర్తి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సింహగిరిపై ఆలయ రాజగోపురం ఎదురుగా శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి



బాలాజీరావు(ఫైల్)

పరవాడ: పరవాడ-లంకెలపాలెం రహదారిలో శుక్రవారం రాత్రి అగ్నిమాపక కేంద్రం సమీపంలోని డివైడర్ ఢీకొట్టిన ప్రమాదంలో చింతల బాలాజీరావు(38) అనే దివ్యాంగ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా.. నాతవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాలాజీరావు కొంత కాలం కిందట తానాం వచ్చి పాన్‌షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తానాం గ్రామానికి చెందిన సూరి అప్పారావును తీసుకొని బాలాజీరావు తన మూడు చక్రాల వాహనంపై పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్తున్న క్రమంలో అగ్నిమాపక కేంద్రం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలాజీరావు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాహనం వెనుక కూర్చున్న అప్పారావుకు స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో శనివారం పోస్టుమార్టం నిర్వహించి బాలాజీరావు మృతదేహన్ని బంధువులకు అప్పగించామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

సబ్బవరం: మండలంలోని ఇరువాడ, బాటజంగాలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి ఎన్.సూర్యలక్ష్మి సందర్శించారు. గర్భిణులు, బాలింతలతోపాటు 3–6 ఏళ్ల పిల్లల తల్లులతో సమావేశమై వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పోషకాహార ప్రాముఖ్యత, పరిశుభ్రత గురించి వివరించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల ఎత్తు కొలిచే విధానాలను వివరించారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తల్లులకు పరిశుభ్రత గురించి వివరిస్తూ వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. బాటజంగాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి స్వచ్ఛత గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, సూపర్‌వైజర్ డి.అప్పలనర్సమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పాప ఎత్తును పరిశీలిస్తున్న సంక్షేమ అధికారి సూర్యలక్ష్మి